
ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025
5
అనంతపురం



అనంతలో విషాదం



మృతి చెందిన తల్లి, తన నాలుగేళ్ల కుమారుడు

◆ శారదా నగర్‌లో తల్లీకుమారుడు మృతి
◆ మృతులు రామగిరి డిప్యూటీ తహశీల్దార్ భార్య, కుమారుడు

వార్త మెయిన్‌లో

ఊరెళ్దామని తీసుకెళ్లి.. ఊపిరితీశాడు..!

◆ నాలుగేళ్ల బాలుడు దారుణహత్య
◆ గొంతునులిమి ఊపిరాడకుండా చేసి...
◆ కిరాతకానికి పాల్పడిన మేనత్త భర్త
◆ తల్లిదండ్రులకు తీరని గర్భశోకం
◆ గరికపల్లిలో విషాదం



హర్షవర్ధన్(ఫైల్‌ఫొటో)

అత్తమ్మ దగ్గరకెళ్దామంటే ఆనంద పడ్డాడు.. దారిలో తినుబండారులు తీసుకుందామంటే సంబరపడ్డాడు.. అమ్మానాన్న కూడా వెనుక వస్తారంటే నమ్మాడు.. వచ్చింది మామయ్యే కదా అని పాఠశాలలో బ్యాగును భుజానకేసుకుని ధైర్యంగా అతని వెంట వెళ్లాడు. పాపం ఆ పసిమనసుకు తెలియలేదు తాను వెళ్తున్నది అత్తమ్మ దగ్గరికి కాదు తిరిగిరాని లోకానికని.. తనను తీసుకెళ్తున్నది మామయ్య రూపంలో ఉన్న రాక్షసుడని..! ఒళ్లంతా విషాన్ని నింపుకున్న ఆ కిరాతకుడు తన కసాయి తనాన్ని బయటకు తీశాడు. తల్లిదండ్రులతో సమానంగా ముద్దుగా చూసుకోవాల్సిన అల్లుడిని అంతం చేసేందుకు తెగబడ్డాడు. ఊరికి తీసుకెళ్తున్నానని చెప్పి దారి మధ్యలో ఊపిరాడకుండా చేశాడు. అడగ్గానే బావ డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో అతని కుమారున్ని అత్యంత కిరాతకంగా హత్య చేసి తన క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చిన ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

ప్రజాశక్తి-తలుపుల, ఎన్‌పి.కుంట

సత్యసాయి జిల్లా తలుపుల మండలం ఓబుళరెడ్డి పంచాయతీ గరికవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ, గంగాధర్ భార్యాభర్తలు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు హర్షవర్ధన్(4) సంతానం. గంగాధర్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూతురి తర్వాత కుమారుడు జన్మించడంతో ఎంతో అల్లారుముద్దుగా తల్లిదండ్రులు అతన్ని చూసుకుంటున్నారు. బాలునికి నాలుగు సంవత్సరాలు కావడంతో వారి గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలకు పంపుతున్నారు. ప్రతి రోజులాగానే బుధవారం నాడు కూడా బాలుడు హర్షవర్ధన్ అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లాడు.

అంగన్‌వాడీ కేంద్రం నుంచి తీసుకెళ్లి హత్య

కదిరి మండలం మూర్తిపల్లిలో వడ్డే గంగాధర్ అక్క భర్త ప్రసాద్ నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. కుమారుని వైద్య చికిత్సల నిమిత్తం తన బావ గంగాధర్‌ను ప్రసాద్ డబ్బులు అడిగాడు. గంగాధర్ కొన్నిసార్లు సాయం చేశాడు. ఇటీవల డబ్బులు అడగ్గా గంగాధర్ తన వద్దలేవని చెప్పాడు. దీంతో ప్రసాద్ తన బావపై కక్ష పెంచుకున్నాడు. తాను పడుతున్న బాధే అతనూ పడాలనే కసాయి మనస్థత్వానికి వచ్చాడు. అందులో భాగంగా గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్‌ను బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రం నుంచి తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. అత్తమ్మ ఇంటికి వెళ్దామని చెప్పడంతో బాలుడు మామయ్య బండిలో ఎక్కి అతనితో వెళ్లాడు.

గొంతునులిమి.. ఊపిరితీసి..!

అంగన్‌వాడీ కేంద్రం నుంచి బుధవారం ఉదయం 11-30 గంటలకు బాలున్ని ప్రసాద్ తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. మొదటి సారి బాలుని ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. మళ్లీ కొంతసేపటి తర్వాత ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసుకుని ప్రసాద్ మరోసారి వారి ఇంటివద్దకెళ్లాడు. అత్తమ్మ దగ్గరకు వెళ్తున్నామని చెప్పడంతో బాలుడు నమ్మి అతనితో వెళ్లాడు. నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలోకి బాలున్ని తీసుకెళ్లాడు. అక్కడ ప్రసాద్ బాలుని గొంతునులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఏమీ తెలియని వాడిలా అతని ఇంటికి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 1 గంట అయినా కుమారుడు ఇంటికి రావడంతో తల్లి ఆందోళనకు గురైంది. వెంటనే అంగన్‌వాడీ కేంద్రంకు వెళ్లి విచారించగా బాలున్ని ప్రసాద్ ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని వెళ్లినట్లు అక్కడి సిబ్బంది చెప్పారు. వెంటనే ప్రసాద్‌కు ఫోన్ చేయగా తన వద్ద బాలుడు లేడని అప్పుడే మీ ఇంటి వద్ద వదిలి వచ్చేశానంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

అటవీ ప్రాంతంలో బాలుని మృతదేహం

బాలుని మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతని ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేశారు. ప్రత్యేక బృందాలు, డాగ్‌స్క్వాడ్‌తో అన్ని ప్రాంతాల్లోనూ విచారించారు. ఈ క్రమంలో బాలుని తల్లిదండ్రులతోనూ వివరాలు సేకరించారు. ఈ సమయంలో బాలుని తండ్రి తన బావ ప్రసాద్‌పై అనుమానం వ్యక్తం చేశాడు. ఆదిశగా పోలీసులు విచారణ చేపట్టి ప్రసాద్ వెళ్లిన ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గురువారం వేకువజామున నంబులపూలకుంట మండలం మరకమ్మదిన్నె-జకవకల గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో బాలుని మృతదేహం కన్పించింది. కుమారుని మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు గుండెలు పగిలేలా కన్నీటి పర్యవంతం అయ్యారు. ఉదయాన్నే నవ్వుతూ ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు విఘతజీవిగా పడి ఉండడాన్ని చూసి శోకసంద్రంలో మునిగిపోయారు.



ఘటనా స్థలం వద్ద బాలుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు



ఊపిరాడకుండా చేసి చంపేశారు..: ఎస్పీ

బాలుడు హర్షవర్ధన్‌ను ఊపిరాడకుండా చేసి చంపేశారని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బాలుని మిస్సింగ్, హత్యకు సంబంధించిన వివరాలను గురువారం మధ్యాహ్నం కదిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. బాలుడు కన్పించలేదని తల్లిదడ్రులు ఫిర్యాదు చేయగానే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం పోలీసుల గాలింపుల్లో బాలుని మృతదేహాన్ని జవకల గ్రామ అటవీ ప్రాంతంలో గుర్తించామన్నారు. తల్లిదండ్రుల అనుమానం మేరకు బాలుని మేనత్త భర్త ప్రసాద్ ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామని తెలిపారు. నిందితుడు ప్రసాద్ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అతన్ని పట్టుకుంటామని తెలియజేశారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, నంబులపూలకుంట ఎస్ఐ వలిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రైతును ముంచి...కార్పొరేట్‌కు దోచిపెట్టి..!

◆ అన్నదాతలకు నష్టంగా పాలకుల విధానాలు
◆ ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం
◆ ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
◆ గార్లదిన్నెలో ఎపి రైతుసంఘం జిల్లా మహాసభలు ప్రారంభం



రైతుసంఘం జిల్లా మహాసభల సందర్భంగా గార్లదిన్నెలో రైతులతో కలిసి ప్రదర్శన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రైతును పూర్తిగా ముంచేసి, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం దేశంలో సాగుతోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఎపి రైతు సంఘం జిల్లా మహాసభ గురువారం నాడు గార్లదిన్నె మండల కేంద్రంలో ఆరంభమయ్యాయి. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ మహాసభ మొదటి రోజు మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. ట్రాక్టర్లతో ముందు వరుసలో రాగా, వెనుక నాయకులు ప్రదర్శన చేపట్టారు. అనంతరం గార్లదిన్నె గ్రామ కూడలిలో బహిరంగ సభ జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలంలో చూస్తే అరటి, పత్తి, ఉల్లి, మిరప, పప్పుశనగ ఇలా ఏ పంటకూ సరైన గిట్టుబాటు ధర లేదని స్పష్టమవుతోందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే సరైన గిట్టుబాటు ధరను అందివ్వలేకపోతున్నారని విమర్శించారు. పత్తి పంటకు క్వింటాళుకు రూ.8110 కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఆచరణలో చూస్తే బహిరంగ మార్కెట్‌లో రూ.5000 కూడా ధర లభించలేదని తెలిపారు. కొనుగోలు చేయాల్సిన సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పుణ్యకాలం పూర్తయ్యాక అక్టోబర్ ఆఖరులో కొనుగోళ్లు ఆరంభించిందన్నారు. అప్పటి వర్షాలు అధికమై తేమ శాతం పెరగడంతో ఆ సాకు చూపించి నామమాత్రంగానే కొనుగోళ్లు చేసిందని పేర్కొన్నారు. ఇక మొక్కజొన్నకు క్వింటాళు రూ.2100 ప్రకటించిందన్నారు. కాని మార్కెట్‌లో రైతుకు లభిస్తున్న ధర రూ.1800లోపే ఉందన్నారు. ఇలా ఏ పంట చూసుకున్నా మద్దతు ధర లేదన్నారు. పప్పుశనగపై పూర్తి సుంకాన్ని ఎత్తివేసిందన్నారు. దీని వల్ల ఇక్కడ రైతులకు మరింత నష్టం జరుగుతుందని తెలిపారు. దేశంలోని రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగం నుంచి రైతులను పారదోలే ప్రయత్నం సాగుతోందన్నారు.

రైతుసంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలోని వ్యవసాయ రంగంపై కార్పొరేట్ శక్తుల కన్ను పడిందన్నారు. ఈ రంగంలో ఇప్పుడున్న చిన్న, సన్నకారు రైతులను పారదోలి వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని వివరించారు. ఆరుగాలం కష్టపడి రైతులు పంట పండించినా ఏ ఒక్క పంటకు సరైన గిటుబాటు ధర లభించకుండా ప్రభుత్వాలే చేస్తున్నాయన్నారు. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రైతుకు దక్కకుండా చేస్తున్నాయని విమర్శించారు. ఇలా చేసి వ్యవసాయం నుంచి రైతును తప్పుకునే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాల విధానాలపై రైతులంతా ఏకమై కలసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేకపోతే రైతు అనే వాడే మిగిలే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఎపి రైతు సంఘం ఆ దిశగా కృషి చేస్తుందని భరోసానిచ్చారు.

ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన పంటలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు ఆచరణలో అమలు జరగడం లేదని చెప్పారు. ఇటీవలి కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే సరైన ధరల్లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కనీసం వారికి మద్దతు ధర కల్పించే విధంగానూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతు సంఘం సత్యసాయి జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల భూములను కట్టబెడుతున్నారన్నారు. సత్యసాయి జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతోనూ, సైన్స్ సీటి పేరుతో, సోలార్ పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాలు భూములు సేకరించారని తెలిపారు. ఈ భూములు కోల్పోయిన రైతులు గ్రామాలను వదిలి వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం వలసలు వెలుతున్నారన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న హామీ అమలు జరగ లేదని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై కలసి పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు బాలరంగయ్య, మధుసూదన్, సీనియర్ నాయకులు ఎంకె.వెంకటరెడ్డి, బిహెచ్.రాయుడు పాల్గొన్నారు.





రైతుసంఘం జిల్లా మహాసభల్లో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్, ప్రభాకర్‌రెడ్డి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను విరమించుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం వైసిపి ఆధ్వర్యంలో డి.హీరేహాల్‌లో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో వైద్య కళాశాలలను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు, మద్దతుదారులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు రహంతుల్లా, వెంకటేశులు, హనుమంత రెడ్డి, ఆనంద్, సందీప్‌గౌడ్, మంజు, జయరామరెడ్డి, గార్మెంట్స్ హనుమంతరెడ్డి, శివారెడ్డి, మల్లి, జగదీష్, విజయేంద్రగౌడ, ఎంపిటిసిలు సూజీ మహేష్, ఎర్రిస్వామి, రైటర్ గంగాధర్, హెచ్‌కె. హనుమంతరెడ్డి, మల్లన్న, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని శాంతినగర్‌లో సంత మైదానం వద్ద కూరగాయల మార్కెట్‌లో ఐఈసి స్టాల్ ఏర్పాటు చేశారు. సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఏరియా హాస్పిటల్ ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కోసం కరపత్రాలు పంపిణీ చేశారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియంత్రణ, ఎఆర్‌టి మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి అవగాహన కల్పించారు. వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు తగదన్నారు. అలాగే క్షయ, సుఖవ్యాధుల లక్షణాలు, చికిత్స గురించి తెలిపారు. చెడు వ్యసనాలు, డ్రగ్స్, మాదకద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నాగమణి, ఔట్‌రీచ్ వర్కర్స్, కె.సుధా, హెచ్.సుధా, మంగళమ్మ, లక్ష్మి, భారతి, ఇందిరమ్మ, పరమేశ్వర, పీర్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

జడ్పీ సీఈవో శివశంకర్



చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో

ప్రజాశక్తి-కుందుర్పి

గ్రామాల్లో పరిశుభ్రత పాటిద్దాం.. వ్యాధులను తరిమికొడదామని జడ్పీ సీఈవో శివశంకర్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని కరిగానపల్లి గ్రామంలో పర్యటించి తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపైకి మురుగు నీరు వదిలితే అపరిశుభ్రత నెలకొని సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడతారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుని అందులోకి మురుగునీటిని వదలాలని, తద్వారా ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పని చేసే వారిని దాని గురించి కొన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. వర్మీ కంపోస్ట్ తొట్టెలను పరిశీలించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కుందుర్పిలో కొందరు డ్రెయినేజీలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని మోహన్, రాజన్న, ఈరన్న, చిరంజీవి కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మాధవి, ఏవో లక్ష్మీశంకర్, ఇన్‌ఛార్జి ఈవోఆర్‌డి రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు నవీన్‌కుమార్, హరీష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి


సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పట్టణంలో చేపట్టిన రిలే దీక్షలకు గురువారం నల్లప్ప సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పట్ల రాజకీయ వేధింపులకు పాల్పడడం, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతంలో కార్మికుల చేత ఖాళీ బాండ్లపై బలవంతంగా సంతకాలు చేయించుకోవడం, కొందరు కార్మికులను విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావును తక్షణమే అరెస్ట్ చేసి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని డిమాండ్ చేశారు. అలాగే వేతనాన్ని రూ. 18,500 నుంచి రూ. 11వేలకు తగ్గించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కాంట్రాక్టర్‌కు నియ మించిన సూపర్వైజర్స్ కిరణ్, గౌతమ్ కార్మికులపై చేస్తున్న అజమాయిషీ, రాజకీయ వేధింపులు, తొలగింపులను వెంటనే ఆపాలని, కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావుతో పాటు కిరణ్, గౌతమ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షా శిబిరంలో అధ్యక్షులు అల్లాబకాష్, రాయదుర్గం మండల అధ్యక్షుడు ఎం.సంజీవప్ప, ఎం.రాజశేఖర్, హసేన్‌బాషా, అంజి, బి.చిత్తప్ప, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప



మంత్రి సవితకు పూలబొకే ఇస్తున్న ఆనంద్ రాజు

ఉప్పర సంఘం డైరెక్టర్‌గా ఆనంద్‌రాజ్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-కణేకల్లు

ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా ఆనంద్‌రాజ్ గురువారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మంత్రి సవితకు పూలబొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేలా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్, మండల మాజీ కన్వీనర్ లాలప్ప, నాయకులు సంపత్‌కుమార్, అబ్దుల్ మహమ్మద్ పాల్గొన్నారు.

ఆగని ఆర్టీసీ బస్సులు.. ప్రయోజనం లేని పాస్‌లు..!

ఇంటర్ విద్యార్థులకు తప్పని కాలినడక

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రమైన బొమ్మనహాల్‌లో ఉన్న విన్సెంట ఫెర్రర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 150 మంది, ద్వితీయ సంవత్సరంలో 100 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వారిలో బాలికలు వంద మందికి పైగా ఉన్నారు. ఈ కళాశాలకు మండలంలోని ఉద్దేహాల్, గోనేహాల్, కొలగానహళ్లి, కృష్ణాపురం, శ్రీధరఘట్ట, గౌనూరు, శ్రీరంగాపురం, ఉప్పరాల, తదితర గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు పాస్ సౌకర్యం కల్పించింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు ఆగడం లేదు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు ప్రధాన రహదారి నుంచి 2 నుంచి 6 కిలోమీటర్లకు పైగా దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గంలో బళ్లారి టు కళ్యాణదుర్గం, బళ్లారి టు రాయదుర్గం ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ విద్యార్థులు ఆపినా బస్సులు ఆపడం లేదు. ఎందుకనగా సాయంత్రం బళ్లారి నుంచి ప్రయాణికులు ఎక్కువగా వస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రిన్సిపల్, ఆర్టీసీ డిఎం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల కోసం బస్సులు ఆపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్సు కోసం పోలీస్ స్టేషన్ ముందు వేచి ఉన్న విద్యార్థులు

పంట సాగుపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రైతును రారాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని ఎరడికెర, వెస్ట్ కోడిపల్లి, తదితర గ్రామాల రైతు సేవాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు' కార్యాచరణతో ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. మండలంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో గ్రామ స్థాయి టీం ప్రతి ఇంటికి వెళ్లి ఈ కార్యక్రమాలను వివరిస్తారన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి సమస్యలు ఉంటే పరిష్కారానికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఇఒ సరస్వతి, మెహతాజ్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో గోపాల

మహిళలపై హింసను అరికట్టాలి : ఐద్వా



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక డిమాండ్ చేశారు. హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల 25నుంచి డిసెంబర్ 10వతేదీ వరకూ నిర్వహించనున్న సెమినార్‌ను గురువారం స్థానిక నలంద జూనియర్ కాలేజ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ప్రముఖ సైకియాట్రిస్ట్ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ హింస వ్యతిరేక దినోత్సవం ఎందుకు ప్రపంచమంతా దీన్ని ఏకధాటిగా ఖండించాల్సిన పరిస్థితి వస్తోందనే విషయాలను వివరించారు. అన్నిరంగాల్లోనూ ఆడపిల్లలు ముందుండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇంటర్ చదివే పిల్లల్లో ఎక్కువగా ఆందోళన ఉంటుందన్నారు. కావున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల మాట్లాడుతూ ప్రపంచమంతా ఏకమై ఈ హింసను అరికట్టాలని మహిళలపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి అశ్విని, కాలేజ్ లెక్చరర్ రాంబాబు, 250 విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

బాలికలు ఆన్‌లైన్ గేమ్స్, ప్రమాదకర సోషల్ మీడియా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మహిళా శిశ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ కోఆర్డినేటర్ బిఆర్ శ్రీదేవి అధ్యక్షతన మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో బాలికల రక్షణ, విద్య, చట్టపరమైన అవగాహన పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల అవగాహనతోపే బాల్యవివాహాల నిర్మూలన అన్నారు. మీరు సురక్షితంగా ఉండటమే కాదు, మీ చుట్టూ ఉన్న వారిని కూడా రక్షించగల శక్తి మీలో ఉండాలని పిలుపునిచ్చారు. అనంతపురాన్ని బాల్యవివాహాలు లేని జిల్లాగా రూపుదిద్దుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త కృష్ణమాచారి, ప్రిన్సిపాల్ గీతారాణి, కెజిబివి అంగన్వాడీ సూపర్‌వైజర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ



వినతులను స్వీకరిస్తున్న అహుడా ఛైర్మన్ టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎంఐజి లేఅవుట్‌లు, ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని అహుడా కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో టీసీ వరుణ్ మాట్లాడుతూ అహుడా పరిధిలోని ప్రతి లేఅవుట్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఐజి లేఅవుట్లలో ప్రతి ఫ్లాట్ కొనుగోలుదారుడికీ మెరుగైన సేవలు అందాలన్నారు. అనంత నగరంలో పింక్ టాయిలెట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కెఎండి ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, సరస్వతి, డిఇ రేవంత్, జెపిఒ హరీష్‌చౌదరి, పబ్లిక్ హెల్త్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సిఎపై అవగాహన

అనంతపురం : స్థానిక సంఘమేశ్ నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో ఐసిఎఐ ఆధ్వర్యంలో సిఎపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సిఎ చార్టెడ్ అకౌంటెంట్ ప్రాముఖ్యతపై ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ అరవింద రామ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సి.సుర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: TADIPATRI
O.S. No. 198/2024

Between:
State Bank of India, Main Branch, Tadipatri. Rep. by its Chief Manager **...Plaintiff**

AND

[1] M/s. Lalitha Super Market, Prop. Kondu Prathap Reddy, H. No. 15-506-1 & 15-506-2, Sadasivaiah Compound, RF Road, Tadipatri.
[3] Smt. Sura Aswani, W/o. Kondu Prathap Reddy,Partner of M/s. Lalitha Super Market, H.No. 8-176-2, Bankamatti Street, Tadipatri. **...Defendants**

SUMMONS TO DEFENDANTS 1 & 3.

Plaintiff herein filed the above suit against you and 3 others in the said Hon'ble Court for recovery of the suit amount of Rs. 14,90,058-97. The suit stands posted to 09-12-2025 for your appearance. Please take notice and that you have to appear either in person or through an Advocate on 09-12-2025 at 10.30 AM before the said court. If you fail to appear on that day the matter will be decided in your absence.

M.KRISHNA MOHAN, B.A., B.L.,
K.MADHU VEENA, M.B.A., L.L.B.,
Advocates for the Plaintiff. Tadipatri.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY
E.P.No: 25/2021 in O.S.No: 145/2018

Between:
K.N.Somasekhar S/o K.N. Linganna, Business, R/of D.No.22/292, Old Guntakal, Guntakal Mandalam, Ananthapuramu Dist. **...Petitioner/DHr**

AND

Shaik Ali Assan Javeed S/o Shaik Sadiq vali, Business,R/of D.No. 7-35-E, Bhagya Nagar, Guntakal Town & Mandalam, Ananthapuramu Dist. **...Respondant/J.Dr**

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Dr కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 15/12/2025వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

The plot is situated in R.D of Ananthapuramu and S.R.D of Guntakal and in the Guntakal Municipality area fields bearing Plot No.170 in Sy. No 443A/1A in Bhagyanagar Old Ward No.3 and New Ward No.5, Present Ward No.7 near D.No. 7/35. Measurements: East-West:-44 Feet or 13.41 meters, North-South:- 24 feet or 7.31 meters Bounded by: East-40 feet Road No.5, West: House of Ghouse Modin in plot No. 169, North: House of Rafeeq in plot No. 161
South:- Open place of Mitai Ibrahim in same Plot No.
E.P. Amount: Rs.7,68,078/-
Market Value: Rs.5,27,985/-
D.Hr value: Rs.5,27,985/-
Amin Value: Rs.22,00,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
టి.ధనుంజయ, DHr వకీలు, గుత్తి,
సెల్:9885896307

29న జాబ్‌మేళా

ప్రజాశక్తి-నార్పల

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో దాదాపు పదికిపైగా నేషనల్, మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల ప్రాంగణంలో కూరగాయల సాగు

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం





ఆకుకూరలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, కోస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

విద్యార్థులకు పోషకవిలువలు అందించేందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఓ సులభమైన ఆలోచనను అమలు చేశారు. భోజనంలో విద్యార్థులకు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పుదినుసులు అందాలన్న ఉద్దేశంలో పాఠశాలలోనే ఆకకూరలు, కూరగాయలు పండించేందుకు ఉపాధ్యాయులు పూనుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని వీరన్నపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణంలోనే ఆకుకూరలు సాగును ప్రారంభించారు. అదికూడా సేంద్రీయ ఎరువుల ద్వారా సాగు చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు కుళ్లాయప్ప నేతృత్వంలో ఇంగ్లీష్ మీడియం బోధన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల కోసం ఈ పాఠశాల ఉపాధ్యాయులు చేసిన ఆలోచన జిల్లాకే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. పాఠశాలలో ఉపాధ్యాయులు పండించిన ఆకుకూరలతోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థులు సైతం ఉపాధ్యాయుల స్ఫూర్తితో ఇళ్ల ప్రాంగణాల్లో సైతం ఆకుకూరలు, కాయగూరలు సాగు చేసుకుంటుండటం విశేషం. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మీ బెదిరింపులకు భయపడం'

మేయర్ మహమ్మద్ వసీం



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

మీ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను ప్రశ్నిస్తే తనను మేయర్ పదవి నుంచి దించుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బెదిరించడం హాస్యాస్పదని.. అలాంటి బెదిరింపులకు భయపడేది లేదని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం నరరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గతంలోనే తమ పార్టీ వారితో కుమ్మక్కై తనను దించాలని చూస్తే చీవాట్లు తిన్నాడని.. అయినా బుద్ధి రాలేదన్నారు. తనకు మేయర్ పదవి నీవు ఇవ్వలేదని,48 స్థానాల్లో గెలిచిన వైసిపి కార్పొరేటర్ల మద్దతుతో తాను మేయర్ అయ్యానన్నారు. అదేవిధంగా తన డివిజన్ పరిధిలో రూ.2.49 కోట్ల అభివృద్ధి పనులు చేశానని ఎమ్మెల్యే దగ్గుపాటి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. తన డివిజన్ పరిధిలోనే కాదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని డివిజన్ల పరిధిలో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైందన్నారు. కనీసం ఎంహెచ్‌ఒను కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. అదేవిధంగా తనకు సిగ్గులేదా అంటున్న ఎమ్మెల్యే.. ముస్లిం మైనారిటీలు అంటే ఆయనకు ఎంత చులకన భావం ఉందో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, రహంతుల్లా, వైసిపి నాయకులు రామచంద్ర, కుళ్లాయిస్వామి, రియాజ్, కోనా రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు తెలియకుండా పనులు ఎలా చేస్తారు..?

సమావేశంలో సభ్యుల నిలదీత




అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీలోని వార్డుల్లో కౌన్సిలర్లకు తెలియకుండా అభివృద్ధి పనులు ఎలా చేస్తారని పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశం రసాభాసాగా సాగింది. ముందుగా వార్డుల్లో తమకు తెలియకుండా సిసి రహదారులు నిర్మిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహం శిథిలావస్థకు చేరుకుందని మున్సిపాలిటీ నిధులతో నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, ఎన్.ఫారూఖ్, వాల్మీకి శివ, వి.వరద అరవింద్, నజీర్, నరేష్ కోరారు. తమ వార్డులో ఉన్న పబ్లిక్ కొళాయిని తనకు చెప్పకుండా ఎలా తొలగిస్తారని కౌన్సిలర్ నజీర్ ప్రశించారు. కొళాయి తొలగింపుతో తాగునీటి కోసం 20 కుటుంబాలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. దీంతో మున్సిపల్ డిఇఇ హేమచంద్రకుమార్ నిర్లక్ష్య సమాధానం ఇవ్వడంతో పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారాన్ని చర్యలు చేపట్టాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖాజా మైనుద్దీన్ కోరారు. మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని సభ్యులు కోరగా త్వరలో నిర్మాణపు పనులకు భూమిపూజ చేస్తామని కమిషనర్ బి.జబ్బార్‌మియా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, మెప్మా సిఒ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నీరు విడుదల చేయాలి

వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి



హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చెరువులకు నీరు విడుదల చేయాలని వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీమంత్రి సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు వైసిపి ఆధ్వర్యంలో పలు గ్రామాల రైతులతో కలిసి వైసిపి నాయకులు గురువారం మండలంలోని సుబ్బరాయసాగర్ డ్యాంను పరిశీలించారు. ఇందులో భాగంగా అక్కడే ఉన్న హెచ్చెల్సీ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతపల్లి చెరువులు ఎండిపోయాయన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 15 రోజుల్లో మరమ్మతులు చేసి చెరువులకు నీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారని హామీ ఇచ్చారన్నారు. అయితే 15 రోజుల్లో నీరు విడుదల చేయని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి వెంకటరమణ యాదవ్, మాజీ సర్పంచు రామానుజన్‌రెడ్డి, మండల రైతులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

టిడిపి సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు



పోస్టర్లను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని టిడిపి సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు తెలిపారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ తోటల్లో పురుగు మందులు పిచికారి చేసేందుకు సబ్సిడీ ద్వారా డ్రోన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20వేలు అన్నదాత సుఖీభవ, పంటకు గిట్టుబాటు ధర, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ అసిస్టెంట్ అఖిల, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 27 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ విబిఆర్ శర్మ తెలిపారు. మిట్సుబా కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించడగా ఇసిఇ విభాగానికి చెందిన విద్యార్థినులు ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ వెన్నెపూస రవీంద్రారెడ్డి, ఎండి వెన్నెపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.రవికిశోర్, హేమసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచు ఎగ్గిడి వరలక్ష్మి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయ ప్రాంగణం పక్కన ఉన్న దళితుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఆత్మకూరు సర్పంచు ఎగ్గిడి వరలక్ష్మి గురువారం భూమిపూజ చేశారు. దాదాపు 50ఏళ్ల క్రితం దళితులకు ఇచ్చిన ప్రభుత్వ స్థలంలో అరుంధతి ఆది జాంబవంతుల యువజన సంఘం కృషితో దళితుల సమావేశాలు, శుభ కార్యక్రమాలు జరిపించేందుకు ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టనున్నట్లు సంఘం నాయకులు వన్నూరప్ప కంటెన్నగారి వెంకటేశులు, వార్డు మెంబర్ ఈశ్వరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత పెద్దలు సత్యప్ప, ఓబులేసు, పెద్దన్న, నాగరాజు, ఈశ్వరయ్య, దళిత మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల పరిధిలోని పూలకుంట క్రాస్ వద్ద ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, నాలుగు చక్రల వాహనాలు సీటు బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. వాహన నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే జరిమాన తప్పదని హెచ్చరించారు.

బస్సులు ఢీ.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం నుంచి అనంతపురం వెళ్తున్న రెండు బస్సులు కదరంపల్లి టోల్ గేట్ సమీపంలో ఓవర్ టేక్ చేయబోయిన ప్రైవేట్ బస్సు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు వెనుక వైపు, ప్రైవేట్ బస్సు ముందర వైపు దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

పంటల పరిశీలన

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలోని హంపాపురం, రామినేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన దానిమ్మ, ద్రాక్ష పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఇందులుఒ భాగంగా ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన పథకం నోడల్ ఆఫీసర్ సుజాత శర్మ హాజరై పంటల దిగుబడి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు, దిగుబడి కోసం పాటించాల్సిన పద్ధతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డిఎఒ ఉమామహేశ్వరమ్మ, డిహెచ్ఒ ఉమాదేవి, ఎపి ఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, కెవికె శాస్త్రవేత్త మల్లేశ్వరి, అనంతపురం ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్, అనంతపురం, తహశీల్దార్ విజయలక్ష్మి, రాప్తాడు హెచ్ఒ దివ్య, ఎఇఒ సుజిత, ఆర్ఎస్‌కె సిబ్బంది పావని, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని ఎ.కొండాపురంలో ఉన్న ఎరువుల దుకాణాలు, గిడ్డంగులను సహాయ వ్యవసాయ సంచాలకులు రాయదుర్గం పద్మజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మన గ్రోమోరు, లక్ష్మీ శ్రీనివాస ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, భవాని ఫర్టిలైజర్స్, ఎరువుల స్టాక్ రిజిస్టర్, లైసెన్స్ పత్రాలు, కొనుగోలు-అమ్మకాల వివరాలు, గడువు తేదీలు, లేబులింగ్, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబులింగ్ లోపాలు, అనుమతి లేకుండా స్టాక్, ధరల్లో వ్యత్యాసాలు, గడువు ముగిసిన, ఎరువుల నిల్వ తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు అందించడమే ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మంలడంలోని పంచాయతీ కార్మికులు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ సాల్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మూడు నెలల నుంచి జీతాలు గానీ, మౌలిక సౌకర్యాలు కానీ కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కుటుంబ పోషణ కూడా భారమైందన్నారు. పిల్లలు పాఠశాలల ఫీజులు కూడా కట్టేందుకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. కావున వెంటనే స్పందించి తమకు వేతనాలు చెల్లించాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రినాగయ్య, సుబ్రమణ్యం, చిన్న కొండయ్య, సి.నాగేంద్ర, బాలప్ప, నాగలక్ష్మి, ఓబులేసు, గంగన్న, ఆటో యూనియన్ నాయకులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



ప్రజాశక్తి-శింగనమల

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి, కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్లేషన్ ఆధ్వర్యంలో గురువారం అమరావతిలోని శాసనసభ భవనం కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ (దుకాణాల లైసెన్సు) నియమాలు, ఎక్సైజ్ (బార్ లైసెన్సు) నియమాలు, 2025 అజెండాలపై చర్చించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లయన్స్ క్లబ్ కార్యాలయంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య మెగా శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 16 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణశెట్టి మాట్లాడుతూ క్లబ్ తరపున ప్రతినెలా ఉచిత కంటి మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి ట్రెజరర్ అల్లాబకాష్ భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, జయరామిరెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, శేషానందరెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తప్పిన ప్రమాదం



అదుపుతప్పిన బస్సు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఓ ఆర్టీటీ బస్సుకు ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం సమీపంలోకి దూసుకెళ్లింది. అయితే బస్సు డ్రైవర్ సుబ్బరాయుడు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రి నుంచి అనంతపురం వస్తున్న ఎపి16.జెడ్0451 నెంబరు ఆర్టీసీ బస్సు డ్రైవర్ సుబ్బరాయుడుకు హైబీపీ రావడంతో ఒక్కసారిగా కంట్రోల్ చేయలేక విద్యుత్ ట్రాన్స్‌ఫారం వైపు బస్సు దూసుకొచ్చింది. అయితే వెంటనే అప్రమత్తంగా వ్యవహరించిన డ్రైవర్ బస్సును అదుపులోకి తీసుకొచ్చి పెను ప్రమాదాన్ని అరికట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వెలుగు సిసికి గాయాలు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిసి మంజునాథ్ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మంజునాథ్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గానికి వెళ్లి తిరిగి ప్రయాణిస్తూ గుండ్లపల్లి క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించిపోయి అదుపుతప్పి ద్విచక్ర వాహనం కింద పడ్డాడు. దీంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్లు పట్టివేత

పెద్దవడుగూరు : పామిడి పెన్నానది నుంచి మిడుతూరు మీదుగా గుత్తికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మిడుతూరు గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.